


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
అక్టోబరు 29, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




## గ్రామీణ యువత కోసం అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ::: డిప్యూటీ సీఎం భట్టి

వచ్చే ఏడాది నుంచి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు

దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యారంగం



## హరీశ్‌రావుకు పితృవియోగం

# పెంచిన టికెట్ల రేట్లలో 20% కార్మికులకే!

- అలా ఇస్తేనే సినిమా టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తాం
- వెల్ఫేర్ ఫండ్ పెట్టండి.. ప్రభుత్వం తరపున రూ.10 కోట్లిస్తాం
- సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల
- హాలీవుడ్ సినిమాలకు కూడా హైదరాబాద్ వేదికవ్వాలి
- తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమకు చోటు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన.. సీఎంకు సినీ కార్మికుల సన్మానం



హైదరాబాద్: సినిమాల విడుదల సమయంలో టికెట్ల రేట్లు పెంచాలంటే.. ఇకపై పెంచిన టికెట్ రేట్ల ద్వారా వచ్చిన ఆదాయంలో 20 శాతం సినీ కార్మికులకు ఇవ్వాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సినీ కార్మికుల వెల్ఫేర్‌ఫండ్ ఏర్పాటు చేసి, ఆ మొత్తాన్ని ఫండ్‌కు జమచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలా ఇస్తేనే టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఆ మేరకు ఒక జీవో జారీ చేస్తామని చెప్పారు. మంగళవారం సాయంత్రం సినీకార్మిక సంఘాలు యూసుఫ్‌గూడ పోలీసు గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రికి సన్మాన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. సినీ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి సినీ కార్మిక వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని

(మిగతా 2వ పేజీలో)

### హైదరాబాద్‌ను కబ్జా చేయడానికి

# మజ్లిస్ ప్రయత్నిస్తోంది

**కేసీఆర్ గంట పాదయాత్ర చేసి ఓట్లు అడగాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో బీజేపీ జోరు పెంచించింది. మంగళవారం ఉత్తరాది తరహా కార్పెట్ బాంబింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏకకాలంలో 50 ప్రాంతాల్లో బీజేపీ నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, శ్రీనగర్‌కాలనీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నియోజకవర్గవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ...'గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబపాలన, అవినీతి, దుర్మార్గపు పాలన పోవాలని, ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కేసీఆర్ రహదారులను అద్దంలా తయారు చేస్తా అన్నారు. బోరబండ, రహ్మత్‌నగర్, షేక్‌పేట్, శ్రీనగర్ కాలనీ, ఎక్కడైనా గంట పాదయాత్ర చేసి ఓట్లు అడగాలి'అని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. పేరుకే

(మిగతా 2వ పేజీలో)



# తీరం దాటిన 'మొంథా' తుపాను

- మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటిన మొంథా తుపాను
- నర్సాపురం సమీపంలో తీరాన్ని తాకినట్టు విపత్తుల సంస్థ వెల్లడి
- రానున్న 6 గంటల్లో బలహీనపడనున్న తీవ్ర తుపాను
- బుధవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఉత్తర కోస్తా, గోదావరి జిల్లాలకు వర్ష సూచన
- రాయలసీమ జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలుపడొచ్చని అంచనా



ఆంధ్రప్రదేశ్‌ను వణికించిన 'మొంథా' తీవ్ర తుపాను తీరాన్ని దాటింది. మంగళవారం రాత్రి 11:30 గంటల నుంచి 12:30 గంటల మధ్య మచిలీపట్నం-కాకినాడ మధ్య నర్సాపురం సమీపంలో ఇది తీరాన్ని దాటినట్టు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. ప్రస్తుతం భూభాగంపై

(మిగతా 2వ పేజీలో)



### 150 మీటర్ల ఎత్తులో

# తుమ్మిడిహెట్టి

- ఆ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- త్వరలో మహారాష్ట్రకు వెళ్లి సంప్రదింపులు జరుపుతాం
- కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ బాధ్యత కాంట్రాక్టర్లదే
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించి 80 టీఎంసీల జలాలను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను

(మిగతా 2వ పేజీలో)



## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

- ప్రజావాణిలో ఫిర్యాదుల ఆధారంగా ఆక్రమణల తొలగింపు
- సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- చందానగర్ సర్కిల్ పరిధిలో 700 గజాల స్థలానికి ఫెన్సింగ్

# పెంచిన టికెట్ల రేట్లలో 20% కార్మికులకే!

సంఘాలకు సూచించారు. ప్రభుత్వం నుంచి వెల్ఫేర్ ఫండ్‌కు రూ.10 కోట్లు డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. 'చాలామంది సినిమా పెద్దలు టికెట్ రేట్లు పెంచాలని నా దగ్గరకు వస్తున్నారు. ధర పెంచితే నిర్మాత, హీరోలకు ఆదాయం పెరుగుతుంది. కార్మికులకు మాత్రం దాని ఫలాలు దక్కడం లేదు. మీ శ్రమతో సంపాదించిన ప్రతి రూపాయిలో మీకు భాగస్వామ్యం ఉండాలి. టికెట్ రేట్లు పెంచడం ద్వారా వచ్చిన ఆదాయంలో 20 శాతం వెల్ఫేర్ ఫండ్ ఇవ్వాలని ప్రభుత్వం జీవో ఇస్తుంది. కృష్ణానగర్‌లో మూడునాలుగు ఎకరాల స్థలం చూడండి. సినీ కార్మికుల పిల్లల చదువుల కోసం నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయి పాఠశాలను నిర్మిస్తాం. టిఫిన్, లంచ్, ఉన్నత విద్య అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అసోసియేషన్‌కు భవనం లేదని నా దృష్టికి వచ్చింది. కొంత స్థలం కేటాయించి, నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఫైటర్స్, సినీ కార్మికుల ప్రాక్టీస్ కోసం స్థలం కావాలన్నారు. ఫ్యూచ ర్‌సిటీలో మీకు కావా ల్సిన ఏర్పాట్లు చేస్తాం'అని సీఎం హామీ ఇచ్చారు.

**హాలీవుడ్‌కు కూడా హైదరాబాద్ వేదికవ్వాలి**

హైదరాబాద్ నగరం హాలీవుడ్ సినిమా షూటింగ్‌లకు వేదిక కావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. 'ఒకనాడు తెలుగు సినీ పరిశ్రమను మద్రాసీ అని పిలిచేవారు. నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, అగ్ర నటులు నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వర్ రావు, కృష్ణ, రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావు వంటి మహానుభావులు తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలిరావడాన్ని ప్రోత్సహించారు. సినీ కళాకారులు, కార్మికులు ఎంతో కష్టపడతారు. నగదు బహుమతుల కంటే కొట్టే చప్పట్లు, సన్మానంలో కప్పిన శాలువాలతోనే సంతోషపడతారు. కవులు, కళాకారులను సన్మానించే కార్యక్రమం పదేళ్లు ఆగిపోయింది. ఆగిపోయిన నంది అవార్డుల కార్యక్రమాన్ని ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో గద్దర్ ఫిలిం అవార్డుల రూపంలో అందిస్తున్నాం. నంది అవార్డులను గెలవడమే గొప్ప అనుకున్నాం. కానీ, తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచంలోనే గొప్పదైన ఆస్కార్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ విజయం వెనుక డైరెక్టర్లు, నటులే కాదు.. కార్మికుల శ్రమ కూడా ఉంది. తెలుగు సినిమాల షూటింగ్ ఇతర దేశాల్లో జరగడం కాదు.. ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదిక కావాలన్నది నా ఆలోచన. మీరంతా అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చే బాధ్యత మాది'అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047



డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమకు ఒక చాప్టర్ పెడతామని చెప్పారు.

**నిర్ణయం తీసుకున్నాక వెనక్కి పోను..**

సినీ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెలలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలి పారు. 'మహాభారతంలో నాకు నచ్చిన క్యారెక్టర్ కర్ణుడు. మిత్ర ధర్మాన్ని ఉల్లంఘించకుండా ప్రాణత్యాగం చేశాడు. మీకు అండగా నేను నిలబడతా. సమస్యలు పరిష్కరిస్తా. నిర్ణయం తీసుకోనంత వరకే నేను ఆలోచిస్తాను. తీసుకున్నా క ఆలోచన చేయను. నవంబర్ చివర లో మళ్లీ మీ సంఘాల నాయకులను కలుస్తా. ప్రతి విషయంలోనూ నిర్దిష్టమైన ప్ర ణాళికతో ముందుకెళతాం. నిర్మాతలతో మీకు ప్రతిష్టంభన వచ్చినపుడు.. మీరు రాణించాలంటే కార్మికులను కుటుంబ సభ్యుల్లా చూసుకో వాలని దర్శక, నిర్మాతలకు చెప్పాను. మీ సమ స్యలను తెలుసుకోవడానికి నేనే కృష్ణానగర్‌కు వస్తా. కార్మికులకు ఇళ్ల గురించి అడిగారు.. ఎంతవరకు సాయం చేయగలనో అంచనా వేసుకున్నాక 24 క్రాఫ్ట్ నాయకులను పిలిచి మాట్లాడుతా' అని సీఎం హామీ ఇచ్చారు.

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో హైడ్రా పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించింది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, కర్మన్‌ఘాట్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కబ్జా చేశారంటూ స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో పార్కు స్థలంగా చూపించి, ఆ తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారిణ జరిపి ఆక్రమణలను తొలగించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురికాకుండా కాపాడినట్లు తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్, చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్ నగర్ పేరుతో 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లే అవుట్ వేసింది. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన లే అవుట్‌లో కొందరు బడాబాబులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాటుగా మార్చారు. ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

## 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి

ఆదేశించారు. ఈ బరాజ్ నిర్మాణంతో మహా రాష్ట్రలో ఏర్పడే ముంపుపై అక్కడి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు త్వరలో మహారాష్ట్రలో పర్యటించనున్న ట్టు ఆయన తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నుంచి సుందిళ్ల బరాజ్‌కి గ్రావిటీ ద్వారా నీళ్లను తరలించి అక్కడి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎత్తిపోయాలనే ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను ఈ సమావేశంలో సూత్రప్రాయంగా ఆమో దించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా 80 టీఎంసీల నీళ్లను తరలించుకోవచ్చనే వాదన ను ఈ సమావేశంలో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) అధికారులు తోసిపుచ్చారు. కనీసం 149 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తేనే 80 టీఎంసీలను గ్రావిటీతో సుందిళ్ల వరకు తరలించగలమని స్పష్టం చేశారు. దీంతో 150 మీటర్ల ఎత్తు లో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాణహిత ప్రాజెక్టు కింద గతంలో నిర్మించిన పనులను వినియోగంలోకి తెచ్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీటి సరఫరా చేయాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనల రూపకల్పన జరగాలన్నారు. సుందిళ్ల బరాజ్‌కు సత్వరం మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఇందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

**కాళేశ్వరం మరమ్మతుల బాధ్యత కాంట్రాక్టర్లదే..**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థలదేనని ముఖ్యమంత్రి రేవంత్ తేల్చిచెప్పారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ %–%2021 ప్రకారం 5 ఏళ్లలోపు దేశంలోని ఆనకట్టల భద్రతకు సంబంధించిన సమగ్ర మూల్యాంకనం పూర్తి చేయాల్సి ఉండగా, ఈ విషయంలో రాష్ట్రం వెనకబడిందని పేర్కొంటూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 17న సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలోని 173 ఆనకట్టల భద్రతకి సంబంధించి మూల్యాంకనం పూర్తిచేసేందుకు 15 నెలల సమయమే మిగిలి ఉందని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు స్వయంగా సమీక్ష నిర్వహించాలని సీఎంకు కేంద్ర మంత్రి సూచించారు. దీంతో కేంద్రం నిర్దేశించిన గడువులోగా అన్ని ఆనకట్టల భద్రతకు సంబంధించి మూల్యాంకనం పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. పురోగతి విషయంలో ఆనకట్టలవారీగా స్థితిగతుల నివేదిక రూపొందించాలని, నవంబర్ రెండోవారంలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

# సాక్షులను బెదిరిస్తే ఇకపై నేరుగా ఎఫ్ఐఆర్

**::: సుప్రీంకోర్టు కీలక తీర్పు**

కేసుల్లో సాక్షులను బెదిరించడంపై సుప్రీంకోర్టు మంగళవారం ఒక చారిత్రక తీర్పు వెలువరించింది. తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ సాక్షులను బెదిరించడం (ఐపీసీ సెక్షన్ 195ఏ) కాగ్నిజబుల్ నేరమని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలపై పోలీసులు కోర్టు నుంచి ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అవసరం లేకుండానే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టవచ్చని తేల్చిచెప్పింది. జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. "ఐపీసీ సెక్షన్ 195ఏ కింద నమోదయ్యే నేరం కాగ్నిజబుల్ అయినప్పుడు, సీఆర్‌పీసీ సెక్షన్ 154, 156 కింద చర్యలు తీసుకునే పోలీసుల అధికారాన్ని శంకించలేం" అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఈ అంశంపై కేరళ ప్రభుత్వం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను విచారించిన అనంతరం ఈ



తీర్పు ఇచ్చింది. గతంలో ఇలాంటి కేసుల్లో కోర్టు నుంచి ఫిర్యాదు తప్పనిసరి అని పేర్కొంటూ కేరళ, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐపీసీ సెక్షన్ 195ఏ (2006లో చేర్చారు) అనేది సెక్షన్ 193 నుంచి 196 వరకు ఉన్న ఇతర నేరాల కంటే భిన్నమైనదని, ప్రత్యేకమైనదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. "ఒక సాక్షి కోర్టుకు రాకముందే, చాలా కాలం ముందే బెదిరింపులు ఎదుర్కోవచ్చు. బాధితుడైన సాక్షి లేదా ఇతరులు వెంటనే పోలీసులను ఆశ్రయించడానికి వీలుగానే ఈ నేరాన్ని కాగ్నిజబుల్‌గా వర్గీకరించారు" అని ధర్మాసనం వివరించింది. అంతేకాకుండా, సీఆర్‌పీసీలోని సెక్షన్ 195ఏ (2009లో చేర్చారు) బాధితులకు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని ఒక అదనపు పరిహార మార్గంగా మాత్రమే కల్పిస్తోందని స్పష్టం చేసింది. అందులో వాడిన 'చేయవచ్చు' (%మెుఎ%) అనే పదం, బాధితులు కేవలం మేజిస్ట్రేట్‌ను మాత్రమే ఆశ్రయించాలనే నిబంధన తప్పనిసరి కాదని సూచిస్తోందని పేర్కొంది. ఈ తీర్పుతో, 2023 ఏప్రిల్ 4 నాటి కేరళ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. నిందితుడిని రెండు వారాల్లోగా ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, ఇతర కారణాలపై బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అతడికి అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదేవిధంగా, యోగేష్ గౌడర్ హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఫిర్యాదుపై ధార్వాడ్ మేజిస్ట్రేట్ 2020లో జారీ చేసిన ఆదేశాలను పునరుద్ధరించింది. ఈ కేసును కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ విషయంలో కేరళ, కర్ణాటక హైకోర్టుల వ్యాఖ్యానాలు "తప్పులతో కూడినవి, నిలకడలేనివి" అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# మావోయిస్టులు ఇష్టంతోనే బయటకు వస్తున్నారు

మాట్లాడారు. లాల్‌సలాం అంటూ తాను మాట్లాడారు. 'ఇది లొంగుబాటు కాదు.. ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో మేం జనంలోకి వచ్చి పనిచేయాలనుకుంటున్నాం. పార్టీలో అంతర్గతంగా చీలిక వచ్చింది ఇది క్లియర్. అవకాశం వచ్చినప్పుడు నేను పిలుస్తా మీరు (మీడియాను ఉద్దేశించి) రండి. నేను మాట్లాడుతా. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతిని పార్టీ ఎన్నుకుంది. పార్టీలో చీలిక వచ్చింది కాంబట్టి ఎవరి మార్గం వారు ఎంచుకున్నారు. మా మార్గం మేము ఎంచుకున్నాం. నేను మాత్రం పార్టీ లైన్‌నే సమర్థిస్తున్న. దేవ్‌జీకి సపోర్ట్ చేస్తున్న. సోనును వ్యతిరేకిస్తున్న. మాకు కూడా ప్రజల మధ్య పనిచేసే కేడర్ ఉన్నారు'అని చెప్పారు.

**చంద్రన్న నేపథ్యం**

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్‌రావు పదోతరగతి వరకు స్వగ్రామంలోనే చదువుకున్నాడు. 1979లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ (బైపీసీ) చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్‌గా వ్యవహరించిన దగ్గు రాజలింగుతో చంద్రన్నకు పరిచయం ఏర్పడింది. ఆయన ప్రభావంతో ఆర్‌ఎస్‌యూలో చేరి 1980లో మల్లోజుల కిషన్‌జీకి కొరియర్‌గా పనిచేస్తూ హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కేఎస్ గ్రూప్‌కు సమాచారం చేరవేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. 1980 జూలైలో ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆసిఫాబాద్ దళంలో సభ్యుడిగా పనిచేశారు. 1981లో పీపుల్స్‌వార్ ఆవిర్భావం తర్వాత సిర్పూర్ దళ కమాండర్‌గా 1983లో బాధ్యతలు చేపట్టారు. 1995 నుంచి నార్త్ తెలంగాణ స్పెషల్‌జోనల్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. 2007లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2008లో కేంద్రకమిటీ సభ్యుడు అయ్యారు. 2021లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 2024 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు బడే దామోదర్ అలియాస్ చొక్కారావుకు అప్పగించిన తర్వాత సీసీ మెంబర్‌గా, తెలంగాణ కమిటీకి మార్గదర్శిగా వ్యవహరించారు. డివిజినల్ కమిటీ సభ్యురాలు మోతీబాయి అలియాస్ రాధక్కను 1989లో వివాహం చేసుకున్నారు. ఆమె 2013 జూన్‌లో భద్రాద్రి కొత్తగూడెంలో అరెస్టు అయ్యింది. 2015లో జైలు నుంచి విడుదలై ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలోని తన స్వగ్రామంలో నివసిస్తోంది.

**ప్రభాత్‌పేరిట పత్రికా ప్రకటనలు ఇచ్చేది బండి ప్రకాశే..:**

బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. 1983లో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఏడో తరగతి వరకు చదివాడు. రాడికల్ యూత్ లీగ్ (ఆర్‌వైఎల్)లో 1984లో చేరాడు. తర్వాత పుల్లూరి ప్రసాదరావు నాయకత్వంలో సిర్పూర్ సాయుధ దళంలో కొనసాగాడు. 1984లో సీపీఐ నాయకుడు వీటీ అబ్రహం హత్యలో పాల్గొని జైలుకు వెళ్లాడు. 1988లో ఆదిలాబాద్ సబ్ జైలు నుంచి పారిపోయి 1989లో అండర్ గ్రౌండ్‌కు వెళ్లాడు. కొన్నాళ్లకు సిద్ధాంతపరమైన విభేదాలు రావడంతో దళాన్ని వదిలి హైదరాబాద్ మల్కాజ్‌గిరిలో సుతారి మేస్త్రీగా పనిచేశాడు. అబ్రహం హత్యకేసులో 1992లో మరోసారి అరెస్టు కాగా. జీవితఖైదు పడి చంచల్‌గూడ జైలుకు వెళ్లాడు. 2004లో మెర్సీ గ్రౌండ్స్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. శాంతిచర్చల సమయంలో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ నుంచి ప్రాతినిధ్యం వహించాడు. 2005లో శాంతి చర్చలు విఫలం కావడంతో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు. 2008 నుంచి 2011 వరకు చర్ల%–%శబరి ఏరియా కమిటీ ఇన్‌చార్జ్‌గా, 2012లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది, ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2015లో ఆరోగ్యం క్షీణించడంతో సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ ఇన్‌చార్జ్‌గా, ప్రజావిముక్తి పత్రిక సంపాదకుడిగా నియమించారు. 2015 నుంచి తెలంగాణ రాష్ట్ర కమిటీ (టీఎస్‌సీ) ప్రెస్‌టీం ఇన్‌చార్జ్ కొనసాగుతూ సీపీఐ మావోయిస్టు పార్టీ పత్రికా ప్రకటనలు 'ప్రభాత్'పేరుతో విడుదల చేస్తున్నాడు.

# హైదరాబాద్‌ను కబ్జా చేయడానికి మజ్లిస్ ప్రయత్నిస్తోంది

జూబ్లీహిల్స్ ఇక్కడ రోడ్డుపై అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలదే బాధ్యత కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ముసుగులో మజ్లిస్‌పోటీ చేస్తోందన్నారు. ఎంఐఎం నేతలు వచ్చి ప్రచారం చేస్తున్నారని, హైదరాబాద్‌ను కబ్జా చేయడానికి మజ్లిస్ పార్టీ ప్రయత్నిస్తోందని చెప్పారు. ఎర్రగడ్డ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ ఏకైక ప్రత్యామ్నాయంగా మారిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో దీపక్‌రెడ్డిని గెలిపిస్తే తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడానికి అది నాందిగా నిలుస్తుందన్నారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, రెండేళ్లు కావొస్తున్నా హామీల అమలులో చిత్తశుద్ధి లేదని చెప్పారు.

# తీరం దాటిన 'మొంథా' తుపాను

ప్రవేశించిన ఈ తుపాను క్రమంగా బలహీనపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే 6 గంటల్లో ఇది తీవ్ర తుపాను నుంచి తుపానుగా బలహీనపడనుందని వెల్లడించారు. తుపాను ప్రభావంతో బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడనున్నాయి. అలాగే కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. తుపాను ప్రభావం రాయలసీమ జిల్లాలపై కూడా ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రకాశం, నెల్లూరుతో పాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. తుపాను తీరం దాటినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. రాగల 24 గంటల్లో ఏపీతో పాటు తెలంగాణ, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# గ్రామీణ యువత కోసం అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు : డిప్యూటీ సీఎం భట్టి

మధిర: తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఆర్థిక శాఖలో ప్రణాళి కలు రూపొందించి ముందుకు సాగుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధి రలో మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. గ్రామీణ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పట్టణాలకు వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోనే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్లలో మెటీరియల్‌తోపాటు డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రం, దేశంలో నిష్ణాతులైన అధ్యాపకులతో ఆన్‌లైన్ బోధన ఉంటుందని చెప్పారు. తొలి విడతగా ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో వీటిని ప్రారంభించేలా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపారు. విద్యావ్యవస్థలో గేమ్ చేంజర్‌గా నిలిచే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామని, ఇప్పటికే నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని భట్టి తెలిపారు. విద్యార్థులు పోషకాహార లోపంతో ఇబ్బంది పడొద్దనే భావనతో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించాలని నిర్ణయించగా, ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, పాలిటెక్నిక్ కళాశాలల్లో అవసరమైన వసతులు కల్పించి ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామని వెల్లడించారు. అంతేకాక ప్రతీ మండలంలో పదేసి గ్రామాలకు ఒకటి చొప్పునమూడు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి దశలవారీగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం సీఎస్‌ఆర్ నిధుల ద్వారా స్థానికంగా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నికోలస్, ఇంటర్మీడియెట్ విద్య కార్యదర్శి ఆదిత్య భాస్కర్, ఈడబ్ల్యూఎస్ ఐడీ ఎండీ గణపతిరెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

**ఎన్పీడీసీఎల్‌కు రెండు ఐఎస్ఓ సర్టిఫికెట్లు**

మధిర: అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు ఐ ఎస్ఓ సర్టిఫికెట్లు టీజీ ఎన్పీడీసీఎల్‌కు దక్కా యి. ఖమ్మం జిల్లా మధిరలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఈ సర్టిఫికెట్లను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి అందజేశారు. విద్యుత్ పంపిణీ కార్యకలాపాలు, సబ్‌స్టేషన్ల నిర్వహణ, నిర్మాణాల్లో అత్యుత్తమ నాణ్యతకు గుర్తింపుగా ఐఎస్ఓ 9001:2015 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్ దక్కిందని భట్టి తెలిపారు. అలాగే, ఉద్యోగుల భద్రతకు తీసుకుంటున్న సురక్షా ప్రమాణా లను గుర్తిస్తూ ఐఎస్ఓ 45001:2018 ఆక్యుపే షనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికె ట్ జారీ అయిందన్నారు. ఈ సర్టిఫికెట్లను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జారీ చేయగా, తెలంగాణలో మొదటిసారి ఎన్పీడీసీఎల్ సంస్థకు దక్కడం విద్యుత్ రంగంలో మైలురాయిగా నిలుస్తుందని భట్టి తెలిపారు.

# హరీశ్‌రావుకు పితృవియోగం

హైదరాబాద్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించబడతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.. హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఆమ్ ఆద్మీ పార్టీ నూతన మునుగోడు నియోజకవర్గం

### ఇంచార్జి గా ఎన్నికైన డాక్టర్ దువ్వ నవీన్



సంస్థాన్ నారాయణపూర్ అక్టోబర్ 28( వార్త మిర్రర్) నారాయణపూర్ అక్టోబర్ 28 నారాయణపురంరానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షులు డాక్టర్ అన్సారీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ దువ్వ నవీన్ ని ఆమ్ ఆద్మి పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇంచార్జి గా ఎన్నుకున్నారు.త్వరలో దీనికి సంబందించిన నియామక పత్రాన్ని అందజేస్తామని డాక్టర్ అన్సారీ తెలిపారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో మాగంటి సునీత గోపినాథ్ గెలుపు ఖాయం: మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు

### బోరబండలో ఇంటింటి ప్రచారంలో భువనగిరి బిఆర్ఎస్ నేతలు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపే లక్ష్యంగా( 331)బూత్ ఏరియాలో ప్రచారంలో పాల్గొన్న భువనగిరి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, భువనగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి బిఆర్ఎస్ నాయకులు బోరబండలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, జక్క రాఘవేంద్ర రెడ్డి, కస్తూరి పాండు, మంజు నాయక్, బత్క అశోక్ యాదవ్ తదితరులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు



## కైలాసం గుట్టకు వెళ్లే దారి లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయండి

### - మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

కల్వకుర్తి, అక్టోబర్ 28 మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి మండలంలోని కైలాసం గుట్ట పై గల శివాలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి పరిస్థితి దయనీయంగా ఉందని హిందూ ఐక్యవేదిక నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఆలయానికి వెళ్లే రోడ్డులో విద్యుత్ దీపాల, డ్రైనేజీ నీటి సమస్యలు భక్తులకు ఇబ్బందులను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భారీగా భక్తులు ఆలయానికి విచ్చేస్తారని దృష్టిలో ఉంచుకుని, శాశ్వత వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే మానస గార్డెన్ వద్ద డ్రైనేజీ నీరు ప్రవహించే ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరచాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు తలసాని లక్ష్మారెడ్డి, పురం శేఖర్ రెడ్డి, బృంగి శ్రీనివాసులు, కుడుముల శేఖర్ రెడ్డి, సింగపాక రామకృష్ణ, కార్తికేయ, రవి, కార్తీక్ సింగ్, మహేశ్వర్ రెడ్డి, కూనా సంతోష్, గణేష్ నాయక్, మాడుగుల రాము, దేవర్ల వెంకటనారాయణ, రానదీర్ తదితరులు పాల్గొన్నారు.



## స్టీల్ పళ్లెం(ప్లేటు)లోనే భోజనం

### మహాలింగపురం గ్రామ సన్నిధానం అయ్యప్ప స్వాములు

శంకర్ పల్లి అక్టోబర్ 28 వార్త మిర్రర్ : శంకర్ పల్లి మండల పరిధిలోనీ మహాలింగాపురం గ్రామ అయ్యప్ప స్వాములు పెళ్లి పంక్షన్ పండగ అన్నదానాలు... ఆఖరుకు ఇంట్లో చేసు కునే చిన్న చిన్న దావతులలో కూడా భోజనాలకు పేపర్ ప్లేట్లు ప్లాస్టిక్ ప్లేట్లు ప్లాస్టిక్ గ్లాసులు వాడు తున్న రోజులివి పేపర్ ప్లేట్ల మీద ప్లాస్టిక్ కోటింగ్ ఉంటుంది వేడివేడి అన్నం కూరలు వేసుకున్నపుడు ప్లాస్టిక్ కరిగిపోతుందని తినే ఆహారం తోపాటు కడుపులోకి వెళ్తుందని మనందరికీ తెలుసు అయినా వాటినే వాడుతున్నాము అయితే ప్లాస్టిక్ పేపర్ ప్లేట్ ప్లాస్టిక్ గ్లాసుల వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణ అర్థం చేసుకున్న మహాలింగపురం గ్రామ అయ్యప్ప స్వాములు స్టీల్ ప్లేట్లు గ్లాసులు కప్పులు వాడడం మొదలుపెట్టారు

## బ్రెయిన్ డెడ్....అవయవాలు దానం

చందా నగర్ వార్త మిర్రర్ : ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్ జరిగి అవయవాలు దానం చేసిన సం ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది....ఎస్ ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం....సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ నగర్ కు చెందిన సామల పాపిరెడ్డి బీ ఏచ్ ఈ ఎల్ కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సామల లత, కుమారుడు నీరజ్ రెడ్డి, కుమార్తె కీర్తన లు ఉన్నారు. అయితే ఈ నెల 25వ తేది శనివారం జేపీ నగర్ నుంచి సాధన స్కూల్ మీదుగా బీఎచ్ఈఎల్ కంపెనీ కి హొండా యాక్టీవ్ (TS 15 EU% 1346) వెళ్తున్న సందర్భంగా స్కూల్ ముందు రాగానే నల్లగండ్ల నుంచి ఆపచే బైక్ (TN 07 BH% 5172) వచ్చి వెనకాల నుంచి ఢీ కొట్టింది. దీంతో హొండా యాక్టీవ్ పై ఉన్న పాపి రెడ్డి ఎగిరి కింద పడడంతో తలకు తీవ్రంగా గాయాలతో పాటు చేతికి, కాలికి దెబ్బలు తగిలాయి. వెంటనే స్థానికులు దెగ్గరలో ఉన్న సిటిజెన్ హాస్పిటల్ కు తరలించారు. రెండు రోజులు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైదులు ధ్రువీకరించారు. ఈ మేరకు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఏస్ ఐ ఆంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చెప్పటారు. రోడ్డు ప్రమాదంలో గాయలై బ్రెయిన్ డెడ్ అయినా పాపి రెడ్డి అవయవాలు దానం చేయాలనీ మృతుడు కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకోవడంతో వైద్యులకు తెలియజేసారు. అవయవాలు దానం చేయడం వల్ల కొన్ని ప్రాణాలు కాపాడుతున్నందుకు డాక్టర్స్ తో పాటు తెల్లాపూర్ గ్రామ ప్రజలు హార్షం వ్యక్తం చేసారు.

# స్కాలర్‌షిప్‌ల ఆలస్యం: ప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకు?

### - ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఎదుట ధర్నా



కల్వకుర్తి, అక్టోబర్ 28 మిర్రర్ ప్రతినిధి:– స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ప్రభుత్వ బిక్షలు కాదని, విద్యార్థుల హక్కులని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు తెలిపారు. కల్వకుర్తి కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు తాటికొండ ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూ..విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపిస్తోంది" అన్నారు.గత బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7 శాతం నిధులే కేటాయించి, వాటినీ పూర్తిగా విడుదల చేయకపోవడం దారుణం. చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో 12–13 శాతం బడ్జెట్ విద్యారంగానికి కేటాయిస్తుంటే, తెలంగాణలో మాత్రం అరకొర నిధులతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అని విమర్శించారు.రాష్ట్రంలోని 90 శాతం మంది విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ మరియు ఇతర బలహీన వర్గాలకు చెందినవారు. వీరిలో చాలా మంది స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారు. కానీ ప్రభుత్వం సుమారు రూ. 8600 కోట్ల రూపాయలను పెండింగ్‌లో ఉంచి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోంది. అనేక ప్రైవేటు విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులతో బంద్‌లు, ఆత్మహత్యల దిశగా వెళ్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, విద్యార్థుల వద్ద నుంచి యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజులు చెల్లించలేక చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని, చదువు పూర్తి చేసిన వారు కూడా సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరూ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై స్పందించాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి అక్కి వంశీ గౌడ్, సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, శివరాం, శ్రీకాంత్ మోహన్, కార్యకర్తలు మరియు అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు.

## హస్తినాపురం నార్త్ ఎక్స్టెన్షన్ కాలనీలో సుమారు 100 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

### ప్రభుత్వానికి, హైడ్రాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన స్థానిక కార్పొరేటర్ సుజాత నాయక్, స్థానికులు



ఎల్బీనగర్,28 అక్టోబర్:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం హైడ్రా తేవడం వల్ల హస్తినాపురం డివిజన్ పరిధిలో గల హస్తినాపురం నార్త్ ఎక్స్టెన్షన్ కాలనీలో సుమారు 100 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని హైడ్రాకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గత 30 సంవత్సరాల క్రితం నాడు ప్లాట్లు చేసిన సమయంలో పార్కు కోసం కేటాయిం ఎకరాచిన 1. ఎకరా 27 గుంటల భూమిని భూ యజమానులు తమదని. కోర్టుకు వెళ్లగా అట్టి స్థలాన్ని హైడ్రా ధికారులు పరిశీలించి మంగళవారం ఒక ఎకరా 27 గుంటల భూమి చుట్టూ ఫెన్సింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అట్టి ప్రభుత్వ స్థలాన్ని కార్పొరేటర్ సుజాత నాయక్ పరిశీలించి హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. త్వరలో అట్టి స్థలంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా పార్కును నిర్మించ నున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా తేవడం వల్ల ప్రతిపక్ష నాయకులు చేసిన కుట్రలు కుతంత్రాలను బట్ట బయలు చేసి ప్రభుత్వ భూములను కాపాడు తున్నట్లు తెలిపారు. 100 కోట్ల రూపాయల విలువగల భూమిని స్వాధీనం చేసుకోవడం ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కి గౌడ్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య గౌడ్, కొండల్ రెడ్డి, బాలాజీ, శ్రీనివాస్ గౌడ్, రామ్ చందర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలి

### నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 28 : రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ పై సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆకాల వర్షాలు సవాల్ గా మారాయని , ఒకేసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు మిల్లులకు ధాన్యం తీసుకురావడం వల్ల ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని, అలా కాకుండా విడతల వారీగా ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లులలో ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ఇందుకుగాను వ్యవసాయ శాఖ వరి పంట కోతల ఆధారంగా ఒక షెడ్యూల్ ను రూపొందించాలని ఆదేశించారు. ఒకేసారి వరి కోతలు జరగకుండా ఇదివరకే డివిజన్ల వారిగా హార్వెస్టర్లతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని, మిర్యాలగూడ ప్రాంతంలో సన్నధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఒక్కోసారి మిల్లుల వద్ద ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఎలాంటి సమస్యలు సృష్టించవద్దని కోరారు. ప్రత్యేకించి సన్నధాన్యం కొనుగోలు విషయంలో తేమ, ఇతర అంశాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి మిల్లులో ధాన్యం వాహనాలు వచ్చేందుకు, వెళ్లేందుకు ప్రత్యేకదారులు ఏర్పాటు చేయాలని కోరారు .పత్తి కొనుగోలుకు సంబంధించి రైతులు స్లాట్ బుక్ చేసుకుని ఏదైనా కారణం చేత పత్తిని అమ్మనట్లయితే స్లాట్ ను రద్దు చేసుకోవచ్చని, రైతుకుండే మూడు స్లాట్లు అలాగే ఉంటాయని, ఈ విషయంపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు .8 నుండి 12% తేమ ఉంటే వెంటనే పత్తి కొనుగోలు కేంద్రానికి వెళ్లే విధంగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని ,తేమను పరిశీలించుకునేందుకు ప్రతి క్లస్టర్ కు ఒక మిషన్ ఇవ్వడం జరిగిందని, రైతులు వారికి సంబంధించిన క్లస్టర్ లో పత్తి తేమ శాతాన్ని పరిశీలించిన తర్వాత ఎంత తేమ ఉందో తెలుసుకొని కొనుగోలు కేంద్రాలకి వెళ్లాలని ఆమె సూచించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు, జిల్లా యంత్రాంగానికి, మిల్లర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని, అయితే ఒకేసారి ధాన్యం రాకుండా విడతలవారీగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరం అయితే టోకెన్లు జారీ చేయడం లేదా ముందే ధాన్యం వచ్చే వివరాలను షెడ్యూల్ రూపొందించి తమకు ఇవ్వాలని, దాని ప్రకారం తాము సహకారం అందిస్తామని తెలిపారు.ధాన్యం సేకరణ ముగిసే వరకు దాన్యం సేకరణలో భాగస్వామ్యం ఉన్న అన్ని శాఖల అధికారులు వారి వారి కార్య స్థానాలలో అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ తో విజ్ఞప్తి చేశారు. అలాగే అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ లలో విధులకు ఆదేశించిన సిబ్బంది అందరూ ఉండాలని కోరారు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో ఆరు లక్షల 13 వేల మెట్రిక్ టన్నుల దాన్యం ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు లక్ష అరవై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, మిర్యాలగూడ ప్రాంతంలో మిల్లులకు సన్నధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు.తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో మిల్లర్లు రైతులకు నష్టం కలగకుండా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు సృష్టించవద్దని కోరారు. రైస్ మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, భద్రాద్రి మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రాంతంలో ప్రతిరోజు 4000 నుండి 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఉందని, నవంబర్ 10నుండి 15 మధ్య ఎక్కువగా ధాన్యం వచ్చే అవకాశం ఉందని ,రైతులు నాణ్యత ప్రమాణాలతోనే ధాన్యాన్ని తేస్తే బాగుంటుందని సూచించారు. దేవరకొండ ఏసిపి మౌనిక, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఆర్డీవోలు రమణారెడ్డి ,శ్రీదేవి, డిఎస్పి శివరాం రెడ్డి ,రాజశేఖర్ శర్మ, డి సి ఓ పత్యా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు..

### మతోన్మాద శక్తుల దుష్టకర ఖండన

### తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతరాజు లాలయ్య.



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : భారత రాజ్యాంగ విలువలను అవమానపరిచే ఘోర సంఘటనగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతరాజు లాలయ్య తీవ్రంగా ఖండించారు.సనాతన హిందూ ధర్మం పేరుతో ఒక మతోన్మాది అడ్వకేట్, సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే సీజేఐ గవాయ్‌పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత దాడి కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు.హిందూ మతోన్మాదులే వెనుక ఉన్నారు.ఈ ఘటన వెనుక హిందూ మతోన్మాద శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. సంఘ్ పరివార్ ఆశ్రయంతో బీజేపీ వీరిని పెంచిపోషిస్తోందని, సనాతన ధర్మాన్ని తామే కాపాడుతున్నామని చెప్పుకునే వీరు, రాజ్యాంగ విలువలను త్రొక్కేస్తున్నారని. ఇది దేశ ప్రజలకు సిగ్గుపడే విషయమన్నారు.గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగంపైనే దాడి అని తెలిపారు సీజేఐ గవాయ్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్న న్యాయవేత్త. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తున్న ఆయనపై మతోన్మాదుల దాడి దళితులు, వెనుకబడిన వర్గాలపై ఉన్న ద్వేషానికి ప్రతీక. దేశ ప్రజాస్వామ్య పునాదులను కాపాడే ప్రతి భారత పౌరుడు దీనిపై స్పందించాలని లాలయ్య పిలుపునిచ్చారు.రాష్ట్రపతి, ప్రధాని, హెూం మంత్రి స్పందించాలిఈ ఘటనపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, హెూం మంత్రి తక్షణమే స్పందించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతరాజు లాలయ్య డిమాండ్ చేశారు."ఇది దేశ న్యాయవ్యవస్థను అవమానపరిచిన ఘోర ఘటన. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠిన శిక్ష విధించాలి అని అన్నారు. మతోన్మాద శక్తుల కుట్రకు ప్రజలు అప్రమత్తం కావాలి దేశంలో మను ధర్మాన్ని తిరిగి స్థాపించాలన్న కాషాయ శక్తుల కుట్ర కొనసాగుతోంది. చాతుర్వర్ణ వ్యవస్థను బలపరచే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఇది కొత్త భారత్ కాదు పాత మను రాజ్యం రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ఐక్యంగా నిలవాలి అని తెలంగాణ అంబేద్కర్ సంఘం తీవ్రంగా ఖండించింది ఇట్టి కార్యక్రమంలో తుకారాం నాయక్, నవనీత్, ఆనంద్, శ్యామ్ , చైతన్య పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు

ఎల్బీనగర్,28 అక్టోబర్పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను వనస్థలిపురం పోలీసులు ఘనంగా నిర్వహించారు.వారోత్సవాలలో భాగంగా మంగళవారం అమర వీరులను స్మరించుకుంటూ స్కూల్ విద్యార్థులతో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ నుండి గురద్వార్ రోడ్డు, రైతుబజార్, గణేష్ టెంపుల్ మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వనస్థలిపురం ఏ సీ పి కాశిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎన్నటికీ మరచి పోలేమని గుర్తు చేశారు. వనస్థలిపురం ఇన్స్పెక్టర్ తోట మహేష్, మీర్పేట్ ఇన్స్పెక్టర్ శంకర్ , హయత్నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు, డివిజన్ ఎస్సైలు, స్టాఫ్ మరియు ప్రజలు పాల్గొన్నారు.



# వ్యవస్థను నడిపే వాళ్ళు బాధ్యత రహితంగా ఉంటే ఎలా ఉంటుందో జిల్లా విద్యాశాఖను చూడవచ్చు

**మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు**

**నిజాయితీగా పనిచేసే ఉపాధ్యాయులపై వేధింపులు మాని, అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి**



మిర్యాలగూడ అక్టోబర్ 28:-( వార్త మిర్రర్ ) పల్లెల్లో పిల్లలు ఎక్కువ పంతుళ్లు తక్కువ.పట్నాలల్లో పిల్లలు తక్కువ పంతుళ్లు ఎక్కువ అక్రమ డిప్యుటీషన్లు రద్దు చేసి, అవసరమైన చోట అవసరమైన వారిని సర్దాలని తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ పత్రికలకు ఇచ్చిన ప్రకటనలోనిజాయితీగా పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అక్రమ ఆరోపణలు చేసి తప్పుడు కేసులు పెట్టి వేదించకండన్నారు .మండల విద్యాధి కారులు వెంటనే స్పందించాలిపల్లెల్లో పిల్లలు ఎక్కువ పంతుళ్లు తక్కువ.పట్నాలల్లో పిల్లలు తక్కువ పంతుళ్లు ఎక్కువన్నారు.ఈ లెక్కలు సరి చేయాల్సిన విద్యా వ్యవస్థ నిద్ర పోతుందన్నారు.వ్యవస్థను నడిపే వాళ్ళు బాధ్యత రాహిత్యంగా ఉంటే ఎలాఉంటదో మన నల్లగొండ జిల్లా విద్యా శాఖను చూడవచ్చన్నారు.అర్హత లేని నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి అక్రమాలకు అన్యాయాలకు పాల్పడటం వలన జిల్లా బడు లల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు.అందులో ఒక అంశమన్నారు. విద్యార్థుల నిష్పత్తికి సరిపడా బోధన సిబ్బంది లేదన్నారు. వున్న చోట ఎక్కువ లేని చోట తక్కువ వుందన్నారు. ఇలా ఎక్కువ తక్కువలను సరి చేసి ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాల్సింది పోయి పైరవీలకు పీట వేస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమై 5 నెలలు కావస్తున్న ఇవన్నీ పరిశీలించి సరి చేయవలసిన మండల విద్యాధికారులు గాని, జిల్లా విద్యాధికారి గాని జిల్లా కలెక్టర్ గాని పట్టించుకోక పోవడ%శీ% క్షమించరాని విషయమన్నారు.తమకు అనుకూలంగా వున్నవాళ్ళను పని లేని చోట పనిచేయిస్తున్నారన్నారు.ఇప్పటి కైనా అధికారులు మేలుకుని వెంటనే ఎక్కువ తక్కువలు సరి చేయాల్సి%శీ%దిగా హెచ్చరిస్తున్నానన్నారు.కలెక్టర్ వచ్చి ఈ రోజుకు సరిగ్గా సంవత్సరమనిఈ సంవత్సర కాలంలో విద్యాశాఖ మీద ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి మీద మండల విద్యాధికారుల మీద ఎన్ని పిర్యాదులు వచ్చినాయో, వాటిని మీరు ఎలా పరిష్కరించారో ప్రజలకు తెలపాలన్నారు.1 జూన్ 2024 నుంచి నేటి వరకు నల్గొండ డిఇఓ, జిల్లాలో ఉన్న అందరు ఎంఇఓలపై ప్రభుత్వ ఉపాధ్యాయులపై ప్రైవేట్ పాఠశాలలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటి పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు.2 జూన్ 2024 నుంచి నేటి వరకు నల్గొండ డిఇఓ,%శ్రీ% ఎంఇఓలు ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రైవేట్ పాఠశాలలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిలో ఎన్ని విచారణ చేశారు తెలపాలన్నారు.3 జూన్ 2024 నుంచి నేటి వరకు నల్గొండ డిఇఓ, ఎంఇఓ ప్రభుత్వ ఉపాధ్యాయులపై ప్రైవేట్ పాఠశాలలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిలో ఎన్ని పరిష్కారం చేశారో తెలపాలన్నారు. ఎన్ని ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయి తెలపాలన్నారు.4-జూన్ 2024 నుంచి నేటి వరకు నల్గొండ జిల్లాలో ఎంత మంది డిప్యూటేషన్ లో ఉన్నారన్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వులు, వారి రెగ్యులర్ పోస్టింగ్ వివరాలు ఈ మొత్తం సమాచారం కూడా మండలాల వారీగా 2019 జూన్ నుండి ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు మూసివేసారో ప్రజలకు తెలపాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునేది నిరుపేద కార్యకర్తల పిల్లలే వారికి కాంగ్రెస్ నాయకులు అన్యాయం చేయకండన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల్లారామీ దగ్గర్లో వున్న బడుల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. మీ నాయకులు నిజాయితీగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ముఖ్యంగా ప్రధానోపా ధ్యాయులను ఎంతగా వేదిస్తున్నారో గుర్తించి నాయకులను నీలాదీయాలాన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పరిశీలికుడుగా ఎం.ఎ.సలీం నియామకం



మిర్యాలగూడ, అక్టోబర్ 28:-( వార్త మిర్రర్) జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారం చేసేందుకు, పరిశీలించేందుకు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.సలీం ను పరిశీలకుడిగా నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి, కన్వీనర్ హెచ్ఎం. షకీల్ నవాజ్ ఆదేశించారు. సుమారు 18మందిని మైనారిటీ నాయకులను ఆయా వార్డులకు నియమిస్తూ సలీం 103వ వార్డులో ప్రచారానికి నియమించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తానన్నారు.



## జూబ్లీహిల్స్ రాజీవ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం మహా పాదయాత్ర..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో రాజీవ్‌నగర్ ప్రాంతంలో పట్టాభి రామ్‌ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి తరపున దీపక్ రెడ్డి కి మద్దతుగా మహా పాదయాత్ర ఘనంగా నిర్వహించబడింది.ప్రాంతమంతా బీజేపీ కి మద్దతుగా నినాదాలతో మార్మోగి, ప్రజల్లో ఉత్సాహం నెలకొంది.ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. దీపక్ రెడ్డి నాయకత్వం ను బల పరచి జూబ్లీహిల్స్ అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని కార్యకర్తలు తెలిపారు.ఈ మహా పాదయాత్ర లోబీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు,నల్లూరి పట్టాభిరామ్ బీజేపీ సీనియర్ నాయ కులు, కన్నికంటి ప్రభాకర్ రాజకీయ విశ్లేషకులు పాల్గొని కార్యకర్తలకు ఉత్సాహం నింపారు.మియాపూర్ డివిజన్ నాయకులు నరేష్, రమేష్, వెంకట్, సాందీప్, కృష్ణ ప్రసాద్, మాధవి చురుకుగా పా,ల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మియాపూర్ టీమ్ సభ్యులు కూడా భారీగా పాల్గొని, బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి కి బలమైన మద్దతు తెలిపారు. రాజీవ్ టీమ్ సభ్యులు రాజీ, జ్యోతి, అంజలి, దివ్య, రినా పాదయాత్రను సమన్వయం చేసి ప్రజలతో మమేకమయ్యారు. ప్రత్యేకంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాద యాత్రకు ఆకర్షణగా నిలిచారు.వారి ఉత్సాహం, బీజేపీపై ఉన్న విశ్వాసం కార్యకర్తలకు మరింత ప్రేరణనిచ్చింది.పాదయాత్రలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు పట్టాభిరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ స్థలం ఆక్రమణ.. ఏడు షెట్టర్ల నిర్మాణం

**శ్రీ రమణ కాలనీలోని సర్వే నెంబర్ 60, ?**
**ప్లాట్ నెం 332 లో 700 గజాల ప్రభుత్వ స్థలం**

**ఇప్పటికే 150 నుంచి 200 గజాల స్థలాన్ని కబ్జా చేసిన పక్క ప్లాట్ యజమాని**

**మిగిలిన స్థలములోనూ హొటల్ నిర్మాణానికి ప్రయత్నాలు**

**ఆర్టిఐ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్**



వార్త మిర్రర్, మీర్పేట్‌ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన వ్యాపార సముదాయ షట్టర్ల కూల్చివేసి, తిరిగి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని హైడ్రా కమిషనర్ కు ఆర్.టి.ఐ రంగారెడ్డి జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఎల్బీనగర్ మునిసిపల్ సర్కిల్ పరిధిలోని నందనవనం పక్కనే ఉన్న శ్రీ రమణ కాలనీలోని సర్వేనెంబర్ 60 లోని ప్లాట్ నెంబర్ 332 లో 700 గజాల స్థలాన్ని ప్రజా అవసరాల కోసం కేటాయించారన్నారు. అయితే, పక్కనే ఉన్న ప్లాట్ యజమాని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఏడు షెటర్లను నిర్మించినట్లుగా తెలిపారు. 700 గజాల ప్రభుత్వ స్థలంలోని సుమారు 150 నుంచి 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిన స్థలాన్ని కూడా కబ్జా చేసి హొటల్ నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని దాన్ని అడ్డుకోవాలని హైడ్రా కమిషనర్ ను కోరారు.ఈ కార్యక్రమం లో బి. రాజు, సతీష్ గౌడ్ పాల్గొన్నారు

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ప్రజలకు లాభం లేదు.. కల్వకుంట్ల కవిత

**షాద్‌నగర్ లో కవితకు ఘన స్వాగతం పలికిన... కప్పటి పాండురంగారెడ్డి**



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్ నగర్ జిల్లా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ సందర్శించడానికి వెళ్తున్న సందర్భంలో బెంగుళూరు హైదరాబాద్ జాతీయ రహదారి షాద్‌నగర్ వద్ద రంగారెడ్డి జిల్లా జాగృతి నియోజకవర్గ ఇంచార్జ్ చీమల రమేశ్ కురుమ, ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ శ్రీనివాస్,మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తఫా తదితలతో కలిసి ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేఖర్లు సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల గెలుపు ఓటముల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమిలేదన్నారు. జాగృతి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈ యాత్రను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేవలం ఉచిత బస్సులు మాత్రమే ఇచ్చి మిగతా ముఖ్యమైన హామీలు పింఛన్లు ఇండ్లు తదితర అంశాల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని కవిత విమర్శించారు. ప్రజలను మేల్కొల్పి వారిలో చైతన్యం తెచ్చే విధంగా తన పర్యటనలు కొనసాగుతాయని ఆమె సందర్భంగా తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు సంబంధించి జరుగుతున్న నిర్లక్ష్యం పై నిలదీసేందుకు తమ పోరాటాలు కొనసాగుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి విభాగం ప్రధాన కార్యధర్శి రాం కోటీ, రాష్ట్ర యంబిసి అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, అందుగుల సత్యనారాయణ,ఉదయ బాను షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు మహేష్, కేశంపేట్ మండల అధ్యక్షుడు వెంకటయ్య,కొత్తూరు కుమార్ మండల అధ్యక్షుడు వీరయ్య, చౌదర్ పల్లి మండల అధ్యక్షుడు అంజీ కురమ , పరూక్ నగర్ మండల అధ్యక్షుడు మల్లేశ్,నరేందర్ గోపు వర్ష జాగృతి శ్రేణులు, మహిళలు మంగళ హారతులతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పటి పాండురంగారెడ్డి ఘన స్వాగతం పలికారు..



## మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ తిరిగి ఏర్పాటు చేయాలి, పి హెచ్ సి వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

సంస్థాన్ నారాయణపురం అక్టోబర్ 28( వార్త మిర్రర్) మండల కేంద్రములో ఆదార్ సెంటర్ లేక పోవటం వలన ఆవాస గ్రామలతో పాటు 31 గ్రామ పంచాయితిలు మరియు నారాయణపురం వచ్చు ప్రజలు ఇంతకుముందు ఆధార్ సెంటర్ ఉండి ఇప్పుడు ఆదార్ సెంటర్ లేదని తెలిసి ఇబ్బంది పడుతున్నారు . చుట్టు ప్రక్కల మండలాలకు పోతున్నరు , మునుగోడు, చౌటుప్పల్ కు పోయిన ఆధార్ సెంటర్లో పని అవడం లేదు. దీనితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా చిన్నపిల్లలకు ఆదార్ ఫోటోలు దింపలన్న, సవరణలు చేయ్యలన్న, చేతి వేలు ముద్రలు,కండ్ల, ఏది కావాలన్నా ఆధార్ సంటర్ అవసరం ఉన్నది. కావున ఆదార్ సెంటర్ మంజూరు చేయించాలని కోరారు. మరియు నారాయణపురం పి హెచ్ సి వైద్యులు సమయపాలన పాటించేలా చూడాలని. గిరిజన ప్రాంతాలు కొండ ప్రాంతాలు నివసించే ప్రజలు ఎక్కువ ఉన్నందున నిత్యవసర సమస్య అయినా వైద్యము అందించి ఇక్కడ ప్రజలను ఆదుకునే విధంగా తగు చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. నయాబ్ తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందు మందుగుల బాలకృష్ణ గుల బాలకృష్ణ. డిసిసిబి డైరెక్టర్ ఏర్పుల సుదర్శన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండీ అగ్బర్ అలీ, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, అంతటి స్వామి గౌడ్ వలిగొండ మాధవులు పాల్గొన్నారు.



## ఆలూరులో చేపల మత్స సంఘం ఏర్పాటు కోసం అభిప్రాయసేకరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 28 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో చేపల మత్స సంఘం ఏర్పాటు కోసం ముదిరాజ్ సంగం వారు జిల్లా మత్య శాఖను కోరగా ప్రజాభిప్రాయం కోసం గ్రామ సభ ఏర్పాటు చేశారు.. దీనికి మెజారిటీ గ్రామ ప్రజలు తిరస్కరించారు. ఆలూరు లోని కొత్త చెరువు గ్రామస్తులు అందరికి చెందాలి ఏదో ఒక వర్గానికి ఉండొద్దని గ్రామస్తులు అందరు అన్నారు. దీనిలో జిల్లా మాత్య శాఖ అధికారి, తహసీల్దార్, ఎంపీవో, కార్యదర్శి, గ్రామస్తులు దాదాపు 500 మంది పాల్గొన్నారు.



## మౌలానా హాఫీజ్ పీర్ షబ్బీర్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన సీఎం

**జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం సోదరులకు సీఎం భరోసా**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జిల్ పల్లి మున్సిపాలిటీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జమాత్ ఉలెమా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మౌలానా హాఫీజ్ పీర్ షబ్బీర్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పటం కాంగ్రెస్ కార్యకర్తల్లో మనోధైర్యం పెంచిందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్, ముస్లిం మైనారిటీ వర్గాల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా హాఫీజ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సహా క్యాడర్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేఎల్ఆర్ భరోసా ఇచ్చారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షహీన్‌నగర్‌లో ఉన్న హాఫీజ్ పీర్ షబ్బీర్ నివాసంలో ముస్లిం సోదరులు, వారి కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు... షబ్బీర్ లేనిలోటు తీర్చలేమన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు %డ% టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి బడంగ్పేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## కేంద్రీయ విద్యాలయంలో షీ టీం ఆవాహన సదస్సు

మిర్యాలగూడ అక్టోబర్ 28:-( వార్త మిర్రర్)మహిళలు, బాలికలపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే షీ టీంకు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని షీ టీం ఎఎస్ఐ తబిత అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం జాప్తివీరప్పగూడెం గ్రామ పంచాయంతి పరిధిలోని కేంద్రీయ విద్యాలయం షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే షీ టీంకు గాని సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం అందిస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. అపరిచితులతో సెల్ ఫోన్లో మాట్లాడవద్దని వారి మోసాలకు గురికాకుండా ఉండాలని కోరారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తంగా ఉండాలని సలహా ఇచ్చారు. మత్తు పదార్థాలుకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ షరీఫ్, విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 28 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట్ , మూటపెల్లి, కొత్తపేట గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు బేతి లక్ష్మి, మండల వసంత,బోద భూమరాజం, గుండ నరేష్, నాయకులు వాసరి రవి, బెజ్జంకి మోహన్, హరీష్ రావు, ఆకుల మహేష్,బి. రాజశేఖర్, మందుల శ్రీనివాస్, వెంకటరెడ్డి, రాజేందర్, బతిని రాజేశం, నర్సయ్య, చింతలపల్లి గంగారెడ్డి, మందుల నరేష్, సి హెచ్.గంగారెడ్డి, సంఘ సీఈఓ ఎలిగేటి రవికుమార్, సెంటర్ ఇంచార్జి సురేష్, పల్లికొండ మహేష్, కళ్యాణ్, రైతులు ఇతర నాయకులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు

### మిషన్ పరివర్తన నషా ముక్తి భారత్ అభియాన్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 28

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్ లో విద్యార్థులకు అవేర్నెస్ కల్పించడం జరిగింది. భారతదేశంలో డ్రగ్స్, ఆంటీ డ్రగ్స్ వ్యవస్థ విచ్చలవిడిగా కొనసాగుతుందని, డ్రగ్స్ వినియోగం అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతుందని, నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2020 ఆగస్టు 15న ప్రారంభించడం జరిగిందని, ఇందులో భాగంగానే పిల్లలకు డ్రగ్స్ పై అవగాహన కల్పించడం, చికిత్స, మాదకద్రవ్యాలను అలవాటు పడిన వారిని పునరావాస కల్పించడం, మాదక ద్రవ్యాల నియంత్రణ, వినియోగాన్ని నిషేధించడం అనే విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం మొదటి, రెండవ బహుమతులు ఇవ్వడం కూడా జరిగింది. ఇందులో జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీఓ సిడిపిఓ మమత, సూపర్వైజర్స్ భాగ్య, సువర్ణ, నరేష్ డి హెచ్ ఈ డబల్యూ అకౌంటెంట్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కొల్లూరి సంతోష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విరహత్ అలీ జర్నలిస్టు సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలి

### టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు..డి రాందాస్



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 : ఓ జర్నలిస్ట్ సంఘం నాయకులు విరహత్ అలీ జర్నలిస్ట్ సమాజానికి క్షమాపణలు చెప్పాలని టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి రాందాస్ అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల నేపథ్యంలో టీఎస్ యుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు విరహత్ ఆలీ జర్నలిస్టులను ఉద్దేశించి విష సర్పాలు, కుట్రలు, బుడ్డ సంఘాలు, బుడార్ ఖాన్లు, కాళ్లలోకి దూరడం వంటి అభ్యంతరకర వ్యాఖ్యలు దురదృష్టకరమని అన్నారు. గతంలో కూడా సంఘాలను, జర్నలిస్టులను కించపరిచేలా విరహత్ అలీ ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. విరహత్ అలీ వ్యాఖ్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రంగా రెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ఆయన వైఖరిని జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు సోషల్ మీడియాలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఇప్పటివరకు విరహత్ అలీ కానీ ఆ సంఘం పెద్దలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. విరహత్ అలీ తన వ్యాఖ్యలపై జర్నలిస్టులకు భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోటోరైటప్ : టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి రాందాస్ ఫైల్ ఫోటో



## శిల్పారామంలో ఆకట్టుకుంటున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్

మాదాపూర్ వార్త మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ 2025 ఎంతో సందడిగా సాగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు శ్రీమతి నిహంత్రి రెడ్డి శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆధ్యంతం అలరించింది. ఝుమ్ ఝుమ్ తనన, గణేశా పంచరత్న, కావడి చిందు, ఒకపరి కొకపరి, నమోదేవ కీర్తన, శ్యామల మీనాక్షి,కంజదళయాదాక్షి , ఎంతమాత్రమూ, దేవి చాముండే, కొలువై ఉన్నాడే, బ్రహ్మమొక్కటే,గరుడగమనా, భో శంభో, శ్రీ రామచంద్ర, శివ పంచాక్షరీ స్తోత్రం అంశాలను శ్రీనిధి, సంహిత, పర్ణిక, ఆరాధ్య, తన్వి, రిత్విక, చార్వి, జాహ్నవి, సుదీక్ష, మౌక్తిక, నైనికా, ఇషితా, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## మహేశ్వరం ఎమ్మార్వో ఆఫీస్ లో లంచం ఇస్తేనే ఫైల్లు ముందుకి

### కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం సోషల్ మీడియా ఇన్చార్జ్ నవీన్ కుమార్



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 : రంగారెడ్డిజిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని.. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ నవీన్ కుమార్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ లో లంచం ఇస్తేనే పనులు చేస్తున్నారు అంటూ.. అటెండర్ నుంచి పై అధికారి వరకు మొత్తం సిబ్బంది లంచం తీసుకోవడం జరుగుతుందని నిరుపేదలు ఆవేదన కు గురవుతున్నారని ఎమ్మార్వో ఆఫీస్ కు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని డిప్యూటీ తాసిల్దార్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ రేషన్ కార్డుకు ?1000 నుంచి 4000 రూపాయల దాకా లంచం తీసుకుంటున్నారంటూ ఆరోపించారు. ఉప తాసిల్దార్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ చాలా అసభ్యకరంగా మాట్లాడుతున్నారు అని మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ అడుగుతే అసభ్యకరంగా మాట్లాడారని తెలియజేశారు ఇలాంటి వాళ్లపైన తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ మరియు అమీర్పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు నీగోల బాలరాజ్ తెలియజేశారు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు.. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక రెడ్డి ని సన్మానించిన నాగేశ్వర్ రెడ్డి





సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 28... విదేశీ పర్యటనకు వెళ్లి నగరానికి వచ్చిన సికింద్రాబాద్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి సోమవారం నాయకులు కార్యకర్తలతో కలిసి తార్నాక లోని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి లను వారు మర్యాదపూర్వకంగా వారి నివాసాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పోచయ్య యాదవ్, నాయకులు కొన్నే సంపత్, దత్తు, మల్లికంటి వీరన్న, వినయ్, హంసరాజ్,మహేష్ తో పాటు పలువురు వారిని కలిసిన వారిలో ఉన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల పర్యటన లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత

### రెండు సంవత్సరాలు గడిచిన ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.పల్నాటి నరేష్ నేత



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పర్యటన కార్యక్రమంలో భాగంగా.. షాద్నగర్లో జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక సమితి వ్యవస్థాపకులు పల్నాటి నరేష్ నేత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు కేవలం ఉచిత బస్సు మాత్రమే ఇచ్చి మిగతా హామీలను అమలు చేయడం లేదని తెలియజేస్తూ.. ప్రజలను మేల్కొల్పి వారిలో చైతన్యం తెచ్చే విధంగా. కవితమ్మ పోరాటాలకు మేము సైతం సిద్ధంగా ఉన్నామని ఆయన తెలియజేయడం జరిగింది

# దేశరాజధానిగాపై కృత్రిమ వాన

**వాయు కాలుష్య భూతానికి వర్షాలతో చెక్ పెట్టాలని యోచన.. పలు చోట్ల పూర్తయిన ట్రయల్స్**



న్యూఢిల్లీ: దేశరాజధానిగా మాత్రమే కాదు కాలుష్య రాజధానిగానూ మారిన ఢిల్లీలో వాయు కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలని రేఖా గుప్తా సారథ్యంలోని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. అనుకున్నదే తడవుగా మేఘాలను చల్లబరిచి వర్షింపజేసే రసాయనాలను చల్లే విమానాలను రంగంలోకి దింపింది. ఐఐటీ%-%కాన్పూర్ సహకారం, సమన్వయంతో మంగళవారం రాజధానిలో మేఘావృత గగనతలంలో మేఘమథన క్రతువుకు శ్రీకారం చుట్టింది. మరికొన్ని రోజులపాటు ఈ విమానాలు రసాయనాలను వెదజల్లే ప్రక్రియ కొనసాగుతుందని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మన్జీందర్ సింగ్ సిర్సా వెల్లడించారు. వర్షించని మేఘాల నుంచి చినుకులు కురిసేలా చేసే ఈ ప్రక్రియను సాధారణంగా క్లౌడ్%-%సీడింగ్ అంటారు. అయితే ఇది వాయుకాలుష్యానికి తాత్కాలిక ఉపశమనంగా పనిచేస్తుందని, ఖరీదైన ఈ ప్రక్రియను శాశ్వత పరిష్కారంగా భావించకూడదని పలువురు పర్యావరణవేత్తలు పెదవి విరుస్తున్నారు.

**కాన్పూర్ నుంచి ఢిల్లీకి..**

ఢిల్లీ స్థానిక ప్రాంతాలను కృత్రిమ వర్షాలతో తడిసి ముద్దచేసేందుకు ప్రత్యేక విమానాలు మంగళవారం కాన్పూర్ నుంచి బయల్దేరాయి. ఢిల్లీలోని బురారీ, నార్త్ కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాల మీది మేఘాలపై ఈ విమానాలు సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ మిశ్రమాలను చల్లాయి. దీంతో మేఘాలు చల్లబడి అందులోని తేమ చినుకులుగా మారి వర్షిస్తుంది. “దాదాపు 20 శాతం తేమ ఉన్న మేఘాలను కృత్రిమ వర్షాల కోసం ఎంపికచేశాం. సెస్నా రకం విమానం ఒక్కోటి 2%-%2.5 కేజీల బరువైన రసాయన మిశ్రమాన్ని వేర్వేరు చోట్ల వెదజల్లింది. దాదాపు 8 ప్రాంతాల్లో క్లౌడ్%-%సీడింగ్‌ను చేపట్టాం. సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ ప్రభావానికి గురైన మేఘాలు కనిష్టంగా 15 నిమిషాల నుంచి గరిష్టంగా 4 గంటల్లోపు వర్షిస్తాయి. గాలులు ఉత్తర దిక్కుగా వీస్తున్నాయని ఢిల్లీ దిశగా వచ్చే మేఘాలనే లక్ష్యంగా చేసుకుని ట్రయల్స్ చేపడుతున్నాం. మరికొద్దిరోజుల్లో కనీసం 10 సార్లు ట్రయల్స్ చేస్తాం. ట్రయల్స్ విజయశాతం ఎక్కువగా ఉంటే ఫిబ్రవరిలో శాశ్వత ప్రాతిపదికన ఈ మేఘమథన కార్యక్రమం కొనసాగిస్తాం. నగరాల్లో భారీ వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు దేశంలోనే ఇదొక ముందడుగు అవుతుంది ” అని మంత్రి మన్జీందర్ వ్యాఖ్యానించారు.

# మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు ‘సుప్రీం’ ఊరట

**ఉమ్మడి ఏపీలో**

**1,200 మంది ఉద్యోగాలు సేఫ్**

**కారుణ్య నియామకాలను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం**

**హైకోర్టు తీర్పును కొట్టేసిన జస్టిస్ అరవింద్‌కుమార్ ధర్మాసనం**




న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో కారుణ్య నియామకాల కింద తిరిగి విధుల్లోకి తీసుకున్న 1,200 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు (ఎంపీహెచ్‌ఏ- పురుషులు) సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వీరి నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం పక్కనపెట్టింది. జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం, ఈ ఉద్యోగులను సర్వీసులో కొనసాగించేందుకు అనుమతిస్తూ మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

**ఏళ్ల తరబడి న్యాయ పోరాటం**

2003లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం సుమారు 2,300 ఎంపీహెచ్‌ఏ (పురుష) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు ఇంటర్మీడియట్ ఒడిప్లొమాను అర్హతగా నిర్ణయించింది. ఆ తర్వాత అర్హతను పదో తరగతి ం డిప్లొమాగా మార్చడంతో వివాదం మొదలైంది. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లగా.. 2012లో పదో తరగతి ం డిప్లొమా అర్హతనే ఖరారు చేస్తూ సుప్రీంకోర్టు తుది తీర్పునిచ్చింది. దీంతో అప్పటికే ఇంటర్ ం డిప్లొమా అర్హతతో ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న సుమారు 1,200 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది.

**ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించిన కోర్టు**

ఉద్యోగాలు కోల్పోయిన 1,200 మంది ఏళ్లపా టు అందించిన సేవలను పరిగణనలోకి తీసు కున్న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం, మానవతా దృక్పథంతో 2013లో వారిని కాంట్రాక్ట్ పద్ధతిలో కారుణ్య నియామకాల కింద తిరిగి విధుల్లోకి తీసుకుంది. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా, తెలంగాణ హైకోర్టు ఆ నియామకాలను రద్దు చేసింది. దీనిపై ఉద్యోగులు, ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. విచారణ సందర్భంగా 2003 నాటి నియామకాలతో సంబంధం లేకుండా, పూర్తిగా కారుణ్య కారణాల ఆధారంగానే 2013లో వీరిని తిరిగి నియమించామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇది పూర్తిగా ప్రభుత్వ స్వతంత్ర నిర్ణయమని అంగీకరించింది. ఈ నేపథ్యంలో, 2013 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. 1,200 మంది ఎంపీహెచ్‌ఏల ఉద్యోగాలను కొనసాగించాలని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు శేఖర్ నాఫ్డే, మాధవి దివాన్, శ్రీరామ్ భాస్కర్ గౌతమ్ వాదనలు వినిపించారు.